ప్రజాశక్తి
శుక్రవారం 13 సెప్టెంబర్ 2024
5
అనంతపురం





ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ

అనంత ఉద్యమాన ఏచూరి

- పలుమార్లు జిల్లాకు విచ్చేసిన సీతారాం ఏచూరి
- వామపక్ష నాయకులతో సమావేశాలు





కళ్యాణదుర్గంలో కొవ్వొత్తులతో సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి ఉమ్మడి అనంతపురం జిల్లాతో అనుబంధముంది. ఆయన పలు సందర్భాల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేశారు. నిమోనియాతో బాధపడతూ గురువారం నాడు ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా ఆయన సిపిఎం శ్రేణులతోపాటు, మేధావులు, వామపక్ష సానుభూతిపరులు జోహార్లు తెలియజేయస్తూ జిల్లాలోనూ ప్రకటనలు విడుదల చేశారు. అనంతపురం జిల్లాతో ఆయనుకున్న అనుబంధం గురించి సిపిఎం నేతలు స్మరించుకున్నారు.

అనేకసార్లు అనంతపురం జిల్లాలో పర్యటన

దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాలో సీతారం ఏచూరి అనేకమార్లు పర్యటించారు. 2002లో సిపిఎం రాష్ట్ర మహాసభలు అనంతపురం నగరంలో జరిగాయి. సంగమేష్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ మహాసభలకు అప్పటి సిపిఎం జాతీయ కార్యదర్శి సూర్జిత్ సింగ్‌తో కలసి ఆయన అనంతపురం విచ్చేశారు. ఆ తరవాత 2004 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ అనంతపురానికి విచ్చేశారు. ఆ తరువాత కూడా వివిధ సందర్భాల్లో ఆయన జిల్లాకు విచ్చేశారు. 2018వ సంవత్సరంలో సిపిఐ నాయకులు నీలం రాజశేఖర్‌రెడ్డి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అనంతపురం విచ్చేశారు. ఆ సమయంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో ఉన్న సమయంలో ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. గతేడాది కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బాగేపల్లి అసెంబ్లి నియోజకవర్గంలో సిపిఎం పోటీ చేసింది. ఆ సమయంలో సిపిఎం అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఏచూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి వేసిన ప్రత్యేక సంచికను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది.

ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

విద్యార్థి ఉద్యమం నుంచి పేదలు, కష్టజీవుల పక్షాన చివరి శ్వాస వరకు నిలిచిన ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి. ఆయన మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు. గొప్ప మేధావిగా, ఆదర్శ పార్లమెంటేరియన్‌గా, అంతర్జాతీయ వ్యవహారాల దిట్టగా పేరుగాంచిన సీతారాం ఏచూరి తన జీవితం యావత్తు సోషలిజం సాధనకు, కమ్యూనిస్టు ఉద్యమాభివద్ధికి ధారపోశారు. పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శకత్వంలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని కదిలించిన యువకిశోరంగా ప్రసిద్ధి చెందారు. కమ్యూనిస్టు ఉద్యమం క్లిష్ట సమయాల్లో ఉన్నప్పుడు 10 సంవత్సరాలు ఆ బాధ్యతలను నిర్వహించారు. మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాల ప్రమాదాన్ని దేశ ప్రజలకు సూటిగా చెప్పగలిగే గొప్ప మేధావి. వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఏకం చేసి 'ఇండియా' వేదికను ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర అత్యంత కీలకం. అనంతపురం జిల్లాల్లో జరిగిన అనేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. 2000 సంవత్సరంలో జరిగిన సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా జిల్లాలోని మేధావులతో ఆయన చర్చించి అనేక విలువైన సలహాలను స్వీకరించారు. 2021లో చివరిసారిగా నీలం రాజశేఖర్ రెడ్డి శత జయంతి సందర్భంగా ఆయన పర్యటించారు. సిపిఎం పార్టీ కమిటీలన్నీ శుక్రవారం నాడు ఆయన మతికి నివాళి అర్పించి, సంతాప సభలు నిర్వహించనున్నాయి.



2002లో అనంతపురంలో జరిగిన సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా అప్పటి సిపిఎం జాతీయ కార్యదర్శి సూర్జితింగ్‌తో ఏచూరి



2018లో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న సిపిఎం సీనియర్ నాయకుడు జి.ఓబులను పరామర్శిస్తున్న సీతారం ఏచూరి



2023 కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బాగేపల్లి నియోజకవర్గంకు సంబంధించి ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఏచూరి

- ఇండియా ఏ 288/8
- అర్ధ సెంచరీలతో రాణించిన సామ్స్ ములానీ, తనుష్
- దులీప్ ట్రోఫీలో బ్యాటర్ల సత్తా



సెంచరీ అభివాదం చేస్తున్న ఇషాన్ కిషన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఇండియా బి టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా సి జట్టు క్రీడాకారుడు ఇషాన్ కిషన్ సెంచరీతో కదంతొక్కాడు. కిషన్ అద్భుథ ఆటతో ఇండియా సి జట్టు భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. మరో మ్యాచ్‌లో ఇండియా ఏ, డీ జట్లు పోటీ పడ్డాయి. ఇండియా ఏ జట్టులో సామ్స్ ములానీ, తనుష్‌లు అర్ధసెంచరీలు సాధించగా ఏ జట్టు గౌరవప్రదమైన స్కోర్ చేసింది. గురువారం నాడు అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఉన్న రెండు మైదానాల్లో రెండో రౌండ్ మ్యాచ్ ఇండియాఏ, డీ మధ్య, ఇండియా బీ, సీ జట్ల మధ్య నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు మొదలైయ్యాయి.

ఇషాన్ కిషన్ మెరుపులు.. ఇండియా సి 375/5

టాస్ నెగ్గిన ఇండియా బి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత జట్టు వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఇండియా బితో జరిగిన మ్యాచ్‌లో మెరిశాడు. రెండవ స్థానంలో వచ్చిన ఇషాన్ కిషన్ 126 బంతుల్లో 14 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సహాయంతో 111 పరుగులు చేశాడు. ఇతనికి తోడుగా బాబా ఇంద్రజిత్ 136 బంతుల్లో 9 బౌండరీల సహాయంతో 78 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ 46, సాయిసుదర్శన్ 43, రజత్ పటిదార్ 40 పరుగులు చేశారు. ఆటముగిసే సమయానికి ఇండియా సి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 375 పరుగులు చేసింది. ఇండియా బి జట్టు బౌలర్లలో ముకేష్‌కుమార్ 3, నవదీప్ శైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ తీసుకున్నారు.

ఇండియా ఏ జట్టు 288/8

మరో మ్యాచ్‌లో ఇండియా ఏ, డీ జట్లు పోటీ పడ్డాయి. టాస్ నెగ్గిన ఇండియా డీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఇండియా ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆటముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. జట్టులో సామ్స్ ములానీ 88(8 ఫోర్లు, 3 సిక్స్‌లు), తనుష్ కొటియన్(6 ఫోర్లు, ఒక సిక్సర్)తో అర్ధసెంచరీలు చేశారు. ఐపిఎల్ స్టార్ ప్లేయర్ రియాన్ పరాగ్ 29 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్ సహాయంతో 37 పరుగులు చేశారు. ఇండియా డీ బౌలర్లలో హర్షిత్ రాణా, కవిరప్ప, అర్షదీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

ఐఎబి సమావేశం వాయిదా బాధాకరం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



ప్రజాశక్తి -అనంతపురం

సాగు, తాగునీటి అవసరాల కోసం చర్చ జరగాల్సిన ఐఎబి సమావేశాన్ని వాయిదా వేయడం బాధాకరం అని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలియజేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం తర్వాత తొలిసారి అనంతపురం జిల్లాకు విచ్చేసిన అనంతను పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు స్వగహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంత మీడియాతో మాట్లాడారు. తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా రైతాంగానికి ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతాంగం ఏకంగా 5 లక్షల ఎకరాలకు పైగా విత్తనం వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో 68 శాతం, శ్రీసత్యసాయి జిల్లాలో 52 శాతం వరకు మాత్రమే పంటల సాగు జరిగిందన్నారు. ఈ ఖరీఫ్‌లో జూలై, ఆగస్టు మాసాల్లో విత్తనాలు వేయని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఐఏబీ సమావేశం వాయిదా వేయడం బాధాకరమన్నారు. తక్షణం ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులు, తేదీలు ఖరాలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయ్యిందని, కేవలం పింఛన్లు ఇవ్వడం మినహా చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల్లో పార్టీ ఓటమిపై సమీక్షించుకుంటామని, క్షేత్రస్థాయిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని తెలియజేశారు.

రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయాలి

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పౌరసరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్న రేషన్ సరుకులను పేదలకు సక్రమంగా పంపిణీ చేయాలని సిపిఎం నగర ఒకటవ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రేషన్ లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాప్ ద్వారా అందిస్తున్న బియ్యం, కందిపప్పు, ఆయిల్, చక్కెర తదితర సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కొందరు డీలర్లు అధికారులతో కుమ్మక్కై బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తూ పేదల కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో అధికార పార్టీ నాయకుల హస్తం ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలో ఉన్న రేషన్ షాపుల్లో ఇప్పటికే బియ్యం, సరుకులు 74 శాతం సరఫరా చేసామని అధికారులు లెక్కలు చూపిస్తున్నా సిపిఎం క్షేత్ర స్థాయి పరిశీలనలో చేయగా చాలా మందికి ఈ నెల కోటా అందలేదని తేలిందన్నారు. కొన్ని దుకాణాల్లో 25 శాతానికి మించి సరఫరా జరగలేదన్నారు. రేషన్‌కార్డులు రద్దు అవుతాయని భయపెట్టి డీలర్లు రేషన్ సరుకులు ఇవ్వకుండానే లబ్ధిదారులతో వేలిముద్రలు తీసుకుంటున్నారని చెప్పారు. ఏ రేషన్ షాపుల్లో ఎంత పంపిణీ చేశారన్న విషయాలను ఆధారలతో సహ రెవెన్యూ అధికారులకు ఇచ్చామని, వాటిని పరిశీలించి సంబంధిత రేషన్ షాపుల్లో విచారణ జరిపిస్తే అక్రమాల బాగోతం వెలుగులోకి వస్తాయని తెలిపారు. సిపిఎం ఆందోళనపై స్పందించిన తహశీల్దార్ వారితో మాట్లాడారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు. మూడు నెలలుగా రేషన్ తీసుకోవాని వారి రేషన్ కార్డులు రద్దు కాకుండా చూస్తామని తెలిపారు. అర్హులైన వారికి బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, వలీ, రాజు, జీవా, ఎన్టీఆర్ శీన, వెంకటేష్, అంజి, డేవిడ్, రవి, బాషా, రామాంజనేయులు, నాగేంద్ర, కుమారి, శంషాద్, దస్తగిరమ్మ, మోహన్, లాలు, లాలెమ్మ, ఫకృన్నీ పాల్గొన్నారు.

విశాలఫెర్రర్‌కు డాక్టరేట్

ప్రదానం చేసిన స్పెయిన్ బూర్గోస్ సిటీ యూనివర్సిటీ



డాక్టరేట్ అందుకుంటున్న విశాలా ఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా ఆర్డీటీ ఉమెన్ వింగ్ డైరెక్టర్ విశాల ఫెర్రర్‌కు స్పెయిన్‌కు చెందిన బూర్గోస్ సిటీ యూనివర్సిటీ ఆఫ్ బర్గోస్ నుంచి గురువారం మధ్యాహ్నం డాక్టరేట్ అందించారు. దేశంలో మహిళల హక్కులు, సమానత్వంపై విశేష కృషి చేస్తున్న ఆమెకు ప్రత్యేకంగా డాక్టరేట్‌ను అందజేశారు. ఆర్డీటీ సంస్థను ఏర్పాటు చేసి జిల్లాలో ప్రత్యేకమైన చొరవతో అన్ని వర్గాల వారికి విద్య వైద్యం క్రీడలు హౌసింగ్ మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేసిన నేపథ్యంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సతీమణి అన్నే ఫెర్రర్‌కు స్పెయిన్ యూనివర్సిటీలు డాక్టరేట్‌ను అందించాయి.

బాధ్యత మరింత పెరిగింది : విశాల ఫెర్రర్

మహిళల సంరక్షణ అభివృద్ధికి ప్రభుత్వాలు చేస్తున్న కృషి ఎంతో ఉంది. అంతకు మించిన ఆత్మస్థైర్యం లక్ష నిర్దేశం ఉన్నప్పుడు సంపూర్ణ మహిళాభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకోసమే ఆర్‌డిటి కృషి చేస్తోంది. తనవంతుగా మహిళా చైతన్యం కోసం క్షేత్రస్థాయిలో అనేక కార్యక్రమాలను రూపొందించి ముందుకు వెళ్తున్నాం. ఇలాంటి గొప్ప ప్రోత్సాహకాలు తమపై మరింత బాధ్యత పెంచుతాయి. భవిష్యత్తులోనూ మహిళ సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో పని చేస్తాం.

రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలి

2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలి - ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతులు



వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమం చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని 1, 2, తలుపూరు సచివాలయాల్లో అధికారులను వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, మండల నాయకులు రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమశేఖర్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పంట పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో రైతులు, కౌలురైతులు పెద్దఎత్తున మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబు ఆ హామీని విస్మరించారన్నారు. అలాగే 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడగా పంటలు తీవ్రంగా నష్టపోయారన్నారు. కరువు దుస్థితి నెలకొనడంతో ఖరీఫ్‌లో 28, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. అయితే నివారణ చర్యలు మాత్రం చేపట్టలేదన్నారు. ఇకపోతే రైతుల మెడకు ఉరితాడులా మారిన జీవో 22ను రద్దు చేసి వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు నారాయణస్వామి, పెద్దన్న, ఎరికలప్ప, బొజ్జన్న, అక్కులప్ప, కన్నయ్య, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



టిప్పర్‌లోకి మట్టి వేస్తున్న జెసిబి

రోడ్డు పనుల కోసం గుత్తేదారు సంస్థ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్థానిక నల్లజాపగుట్ట నంజప్పగుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తోంది. రోడ్డుకు పక్కనే ఉన్న నల్లజాపగుట్ట నుంచి భారీస్థాయిలో మట్టి తరలిస్తుండడంతో పనులు అయ్యేలోపు గుట్ట మాయమయే పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. రాయదుర్గం మండల పరిధిలోని 74 ఉడేగోళం మధ్యానేశ్వరస్వామి ఆలయ ఆర్చ్ నుంచి గుమగుట్ట మండలంలోని ఉడేగోళం, బిఎన్.హళ్లి, నేత్రపల్లి గేట్, ఎస్.కొత్తపల్లి వరకూ రెండు వరుసల బిటి రోడ్డు వేస్తున్నారు. పనులు చేపడుతున్న గుత్తేదారు సంస్థ రోడ్డును విస్తారం చేసేందుకు గుమ్మగట్ట మండలంలోని నేత్రపల్లి పరిధిలోని సర్వేనెంబర్ 228, 229లోని 2.66 ఎకరాల విస్తీర్ణంలో నంజప్పగుట్ట మినహాయించి అసైన్డ్ భూములు ఉన్నాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. గుత్తేదారు సంస్థ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా గుట్టను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఏకధాటిగా మట్టి తరలింపుతో గుట్ట పూర్వ స్వరూపం కోల్పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై విఆర్ఓ మాణిక్యను ప్రజాశక్తిని వివరణ కోరగా నంజప్పగుట్ట నుంచి మట్టి తరలింపునకు ఎవరూ అనుమతి తీసుకోలేదన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

ఐసిడిఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం

బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసిడిఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జీఓ 31, 39, బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలు, కర్తవ్యాలపూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగితే ఇక నుంచి గ్రామస్థాయిలోని అన్ని శాఖల అధికారులు కూడా బాధ్యులేనన్నారు. కావున మండల, డివిజన్, జిల్లా స్థాయిలోనూ అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యం కావాల్సిందేనని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అని స్థాయిలోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేసిన చట్టాలు, జారీ చేసిన ఉత్తర్వులపై అన్ని వర్గాల వారిలో చైతన్యం తీసుకురావాలని కూడా కోరారు. బాల్య వివాహం చేసినా, ప్రోత్సహించినా, హాజరైనా అటువంటి వారందరూ శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు చేస్తే జైలు జీవితం తప్పదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ కోరారు. బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందన్నారు. గ్రామస్థాయిలో వీఆర్వో పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్య పరంగానే కాకుండా మానసికంగా, శరీరకంగా, సామాజిక పరంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారని డిఎంహెచ్ఓ డాక్టర్ ఇబి.దేవి హెచ్చరించారు. శారీరక ఎదుగుదల లేక, చిన్న వయస్సులోనే గర్భ దాలిస్తే, కొన్ని సమయాల్లో తల్లీబిడ్డ ఇద్దరూ మరణించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై తల్లిదండ్రులకు, డ్రాప్ అవుట్ పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మంజునాథ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓలు ధనలక్ష్మి, ఉమా శంకరమ్మ, చైల్డ్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, అనంతపురం అర్బన్, రూరల్, ఆత్మకూరు, కూడేరు, రాప్తాడు మండలాల వైద్యాధికారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ ఉద్యమం

'శ్రీరామిరెడ్డి', 'సత్యసాయి' కార్మికులు



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సమస్యలు పరిష్కరించేంత వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి పథకాల సంఘాల నాయకులు ఓబులేసు, పొన్నూరప్ప, రామాంజి హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు 11రోజులుగా చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగానే గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ సాగిస్తున్నప్పటికీ నెలలు తరబడి వేతనాలు అందకపోతే ఎలా జీవించాలని నిలదీశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఆనంద్, భాస్కర్, భార్గవ్, లక్ష్మన్న, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

వామపక్ష యోధుడు, సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజా ఉద్యమానికి ఏచూరి మరణం తీరని లోటని అన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగు పెట్టిన సీతారాం ఏచూరి.. నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. కార్మిక లోకానికి, లౌకిక వాదానికి ఏచూరి మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. పేదల కోసం జీవితాంతం ఉద్యమాలు చేశారని గుర్తు చేసుకున్నారు. సీతారాం ఏచూరి రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన కాలంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నానని, ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఓ మంచి నాయకుడిని దేశం కోల్పోయిందన్నారు.



ఉరవకొండలో కామ్రేడ్ ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఉరవకొండ : సీతారాం ఏచూరి మృతికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు అనంతపురం జిల్లాతో చాలా అనుబంధం ఉందన్నారు. జిల్లాలో జరిగిన అనేక ప్రజా పోరాటాల్లో ఏచూరి పాల్గొన్నారని గుర్తు చేశారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఉరవకొండలో ప్రత్యక్షంగా పాల్గొని తన విజయానికి కృషి చేశారని వివరించారు. అంతేగాకుండా విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగు పెట్టిన సీతారాం ఏచూరి.. నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. కార్మిక లోకానికి, లౌకికవాదానికి ఏచూరి మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

అలాగే సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సీతారాం మరణం పార్టీతోపాటు దేశానికి తీరని లోటని సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్ అన్నారు. గురువారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు గుర్తుచేసుకొని వాటిని అనుసరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మురళి, వీరాంజనేయులు, రవికుమార్, రామాంజినప్ప, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశ రాజకీయాలకే తీరని లోటని రాష్ట్రపతి అవార్డు గ్రహీత చల్లా కిషోర్‌చౌదరి అన్నారు. ఈమేరకు గురువారం సంతాపం తెలిపారు. ఏచూరి ఆత్మకు శాంతి కలగాలని పలువురు పెద్దలు నాయకులు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో విశ్రాంతి అధ్యాపకులు మల్లికార్జున, ఓబుల్‌రాజు, లింగప్రసాద్. మల్లికార్జున, బాబు, కిరణ్, రోజిలి, తదితరులు ఉన్నారు.



పుట్లూరు మండలం కడవకల్లులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



గుత్తిలో కామ్రేడ్ ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుత్తి : పట్టణంలోని దాసరి కాలనీలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వి.నిర్మల, ఐద్వా మండల కార్యదర్శి ఎస్.రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, నాయకులు రేవతి, శ్యామల, వెంకటలక్ష్మి, మారి, రమణ, రామంజనేయులు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామంలో కామ్రేడ్ సీతారాం ఏచూరికి గురువారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకట్‌చౌదరి, నాయకులు జె.పెద్దయ్య, టి.పెద్దయ్య, నాగభూషణం, భాస్కర్‌రెడ్డి, ఎస్.పుల్లయ్య, నరేంద్ర, మల్లేశ్వరి, అంజనమ్మ, దేవి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : సిపిఎం, ప్రజాసంఘాలు, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి బాధాకరమన్నారు. ఆయన లేని లోటు పార్టీతోపాటు దేశానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఈశ్వరయ్య, చితప్ప, అశోక్, విశ్రాంత అధ్యాపకులు మల్లికార్జున, సిపిఎం నాయకులు రఘు, రంగనాథ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, ఐద్వా మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి లత, సిఐటియు నాయకులు లక్ష్మీ, తులసి, వన్నూరుస్వామి, రామచంద్ర, ఈశ్వర్, నటరాజ్, రమణ, శివ, అరవింద్, భవిత్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

17న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈనెల 17న నిర్వహించనున్న నులిపురుగుల దినోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రామ్‌కుమార్, పరమేశ్వరులు మాట్లాడుతూ మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. తాడిపత్రి సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రేడేను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీరామ్‌కుమార్, పరమేశ్వర్, తాడిపత్రి సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిహెచ్ఒ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అవగాహన

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఐవి వైరస్, ఎయిడ్స్ వ్యాధి, ఇతర సుఖ వ్యాధులపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి నివారణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం వైద్య ఆరోగ్య సిబ్బంది మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ సిబ్బంది, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

గుత్తి : మండలంలోని ధర్మపురం గ్రామంలో రైతులు సాగుచేసిన పంట పొలాలను రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం సందర్శించారు. ఇందులో భాగంగా కంది, వేరుశనగ, ఆముదం, సజ్జ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంది పంటలో ఫ్యూసేరియం విల్ట్ గుర్తించారు. దాని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ ను లీటర్ నీటిలో మూడు గ్రాములు కలిపి నేలను తడపాలని సూచించారు. అలాగే ఆముదం పంటలో కాప్సూల్ బోరార్ గుర్తించి నివారణకు ప్రొఫెనోఫోస్ రెండు మిల్లీగ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ శంకర్‌బాబు, శాస్త్రవేత్తలు భాస్కరరావు, కె.లక్ష్మణ్, నజీరుద్దీన్, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు, వ్యవసాయ అధికారి మెహరున్నీసా, ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జి మెర్సీ, తదితరులు పాల్గొన్నారు.

పాళ్యంలో వరి గ్రామీణ విత్తనోత్పత్తి

పామిడి : మండలంలోని పాళ్యం గ్రామంలో జిల్లా రీసోర్స్ సెంటర్ పీడీ డిఆర్ సి శైలజకుమారి ఆధ్వర్యంలో వరిలో గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి విత్తనం ఎంపిక, మంచి విత్తనం ఎలా పొందాలి.. సీడ్ విలేజ్ ప్రోగ్రాం ద్వారా తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లీలా వసుంధర, శంకర్ లాల్‌నాయక్, శ్రీనివాసరావు, ప్రసాద్, రాధారాణి, రైతులు నారాయణస్వామి, ఆదినారాయణ, తిరుపతయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి శ్రేణులకు అండగా ఉండాలి

అనంతపురం : వైసిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రత్యర్థుల దాడిలో గాయపడ బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త ఆదిలక్ష్మికి జగన్ నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును వీరాంజనేయులుకు గురువారం అనంతపురంలోని అనంత స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ సమస్యల వచ్చినా అండగా నిలవాలన్నారు. అంతేగాకుండా అందరినీ కలుపుకుపోయి పార్టీ పటిష్టత కోసం పని చేయాలని సూచించారు.

దుకాణాలకు నోటీసులు

నార్పల : మండల కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాలు, దుకాణాలకు తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ తిక్కస్వామి ఆలయ ఆవరణలో దుకాణాల్లో ఉపయోగించే తూకం, కొలతల పరికరాలను పరిశీలించారు. తూకం, కొలతల పరికరాలకు ముద్ర వేయించుకోని దుకాణదారులకు నోటీసులు అందజేశారు.



క్రీడాపోటీల్లో రాణించిన జట్టు

క్రీడాపోటీలు ప్రారంభం

యల్లనూరు : మండలంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాల, బాలికలకు చిలమకూరు ఆదర్శ పాఠశాల మైదానంలో గురువారం నుంచి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు క్రీడాపోటీల్లో రాణించిన విద్యార్థులకు విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు వరిపంటను తగ్గించి.. ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాముతోపాటు రోటరీపురంలోనిరైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఉద్యాన సహాయకునితో కలిసి ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15వతేదీ లోపు రైతుల ఇకెవైసి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకపోతే భూగర్భజలాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు ఎక్కువ నీరు తీసుకునే వరిపైరును తగ్గించి ఆరుతడి పైరును సాగు చేయాలన్నారు. తర్వాత రేకులకుంటలో ప్రకృతి పద్ధతిలో రైతు శ్రీనివాసులు సాగు చేస్తున్న వరి, కూరగాయల తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఇఒ ముస్తఫా, రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జి జగన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కూడేరుకు రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

కూడేరు మండలానికి రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గంలోని కూడేరు మండలానికి రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడం బాధాకరమన్నారు. మండలంలో రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో రైతులు, సామాన్యులు, పేదలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికీ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ఎస్.కరీం, మల్లికార్జున, చిన్నా వీరభద్రప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి వి.శంకర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండలం ప్రజా పరిషత్ కార్యాలయం సభా భవనంలో ఎంపిడిఒ రామచంద్ర ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

యల్లనూరు : పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై ఎంపిడిఒ వీరరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. అలాగే తాగునీరు, నిరుపేదలకు ఇళ్ల మంజూరు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి విజయశేఖర్ నాయుడు, ఎపిఒ షబ్బీర్, పంచాయతీ రాజ్ ఇంజనీర్ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీరు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అత్యంత కీలకం

ది ట్రెల్లిస్ స్కూల్ కరస్పాండెంట్ వడ్ల శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నేటి ఆధునిక సమాజంలో డబ్బు విలువ, ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన అవసరమని ది ట్రెల్లిస్ స్కూల్ కరస్పాండెంట్ వడ్ల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ట్రెల్లిస్ స్కూల్‌లో డబ్బు విలువ, దుబారా ఖర్చులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన ప్రణాళికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది పిల్లలకు డబ్బు సంపాదించడానికి అవసరమైన ప్రాముఖ్యత, కృషిపై అవగాహన లేనందున తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఇచ్చిన డబ్బులు దుబారా చేస్తున్నారన్నారు. అందుకే ఈ అంశంపై అవగాహన కల్పించేందుకు ది ట్రెల్లిస్ స్కూల్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రత్యేకంగా సామర్థ్యం ఉన్న, బహుముఖ ప్రతిభావంతులైన అంధ మహిళా గాయకులను ముఖ్య అతిథులుగా స్వాగతించి అనుభవాలను పిల్లలకు పంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోశాధికారి నందిని, యాజమాన్య సభ్యులు అమిత ప్రియ, ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న అంధ మహిళా గాయకులు

మున్సిపల్ కార్మికులకు భద్రత కల్పించాలి

సిఐటియు నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపల్ కార్మికులకు ఉపాధి భద్రతతోపాటు, సౌకర్యాలు కల్పించాలని సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులకు పని చేసే ప్రదేశాల్లో భద్రతా పరికరాలు ఇవ్వకపోవడంతో చాలామంది రోగాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న జరిగిన గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రజలు ఉత్సాహంగా రంగులు జల్లుకున్నారు. ఆ రంగులను శుభ్రం చేయాలంటే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. కనీసం మాస్కులు, చేతి తొడుగులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అలాగే డ్రెయినేజీ కాలువల్లో పని చేస్తున్న కార్మికులు మోకలు లోతు బురదలో దిగడం వల్ల గాజు పెంకులు, క్రిమి సంహారక మందు డబ్బాలతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

జపాన్ యూనివర్సిటీతో 'పివికెకె' ఒప్పందం

అనంతపురం : జపాన్‌కు చెందిన ఐజు యూనివర్సిటీతో నగరంలోపి పివికెకె ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్, సమాచార వ్యవస్థల విభాగం, ఐ ట్రాన్స్‌పోర్టేషన్ క్లస్టర్ లీడర్, యూనివర్సిటీ ఆఫ్ ఐజు, జపాన్ రాగే ఉదయ్ కిరణ్, తదితరులు పివికెకె ఐటీ కళాశాలకు విచ్చేసి కళాశాల మేనేజ్‌మెంట్, పరిపాలనా అధికారులు, సీనియర్ ఫ్యాకల్టీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాగే ఉదయ్‌కిరణ్, కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్‌తో అవగాహన ఒప్పంద పత్రంపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, అకడమిక్ డీన్ వై.సంతోష్‌రెడ్డి, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఐఎబి' వాయిదాతో నట్టేట మునిగిన రైతులు

ఉరవకొండ : ఐఎబి సమావేశం వాయిదా వేసి అనంత రైతులను నట్టేట ముంచారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు కెవి.రమణ అన్నారు. గురువారం ఉరవకొండలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన అనంతపురం జిల్లా సాగునీటి సలహాదారుల బోర్డు (ఐఎబి) సమావేశం మరోసారి వాయిదా పడటం జిల్లా రైతాంగానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఎందుకంటే జిల్లాకు వర్షాలు తక్కువగా కురుస్తాయి కాబట్టి ఏకైక ఆధారమైన తుంగభద్ర జలాలను సకాలంలో తీసుకొస్తేనే రైతులు, ప్రజల మనుగడ సాధ్యమన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని వెంటనే సమావేశం ఏర్పాటు చేసి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి కనీసం హెచ్ఎల్‌సి ఆయకట్టునైనా స్థిరీకరించాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యర్రగుంట జయన్నకు సేవారత్న పురస్కారం

కుందుర్పి : మండలంలోని యర్రగుంట గ్రామానికి చెంది గుంతకల్లులో స్థిరపడిన వైఎస్ఇఎస్ కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ టి.జయన్నను సేవా రత్న పురస్కారం వరించింది. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో సర్వేజనా సుఖినోభవంతు సామాజిక సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారాన్ని జయన్నకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జయన్న మాట్లాడుతూ ఈ పురస్కారం సామాజిక సేవలపై మరింత బాధ్యత పెంచిందన్నారు. అంతేగాకుండా తనకు అన్నివిధాలుగా సహకరించిన కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.




సేవారత్న పురస్కారం అవార్డును పొందుతున్న టి.జయన్న

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-రాయదుర్గం

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. 'స్వచ్ఛ రాయదుర్గం-స్వస్థ రాయదుర్గం' కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా.. కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. నీటి నిలువలపై మూతలు వేసుకోవాలని, వారానికి ఒకసారి డ్రై డే పాటించాలని, తద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులను నివారించవచ్చన్నారు. ఆరోగ్య బోధకుడు డాక్టర్ కెంచే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆడైనా.. మగైనా ఇద్దరూ సమానమే అన్నారు. వివక్ష చూపవద్దన్నారు. శిశువు కడుపులో ఉండగానే స్కానింగ్ ద్వారా లింగ నిర్ధారణ జరిపి ఆడకూతురైతే అబార్షన్ పేరుతో భ్రూనహత్య చేయడం చట్ట విరుద్ధమన్నారు. అలా లింగ నిర్ధారణ జరిపితే సంబంధిత వైద్యులు, తల్లిదండ్రులకు మూడు నెలల జైలు శిక్ష, పదివేల జరిమానా విధించేందుకు చట్టం ఉందని చెప్పారు ఆడపిల్లల్ని బాగా చెల్లించాలని, బాల్య వివాహాలు చేసి ఆడపిల్లల జీవితాలు నాశనం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శాంతి కుమారి, సరోజ, మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఈ-క్రాప్ నమోదుకు రైతులు సహకరించాలి

మండల వ్యవసాయ అధికారిణి సరిత

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఈక్రాప్ నమోదుకు మండలంలోని రైతులు సహకరించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత సూచించారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల సచివాలయాలను ఆకస్మింకగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని వేపులపర్తి, పిల్లలపల్లి, తీటకళ్లు, తదితర గ్రామాల్లోని రైతు సేవాకేంద్రంలో ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈపంట నమోదు చేయించుకున్న ప్రతి రైతూ తప్పకుండా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఇకెవైసి చేయించుకున్న తర్వాతనే పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్లు సంకేతం అన్నారు. ఇప్పటి వరకూ రైతులు 8,295 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేయించుకున్నారన్నారు. ఇప్పటి వరకూ 343 మంది మాత్రమే ఇకెవైసి చేయించుకోలేదన్నారు. వారందరితో ఇకెవైసి చేయించాలన్నారు. ఈ సమావేశంలో విఆర్ఒ మల్లికార్జున, విహెచ్ఎ ముజీవీర్ బాషా, మాజీ సర్పంచులు హనుమంతప్ప, తిప్పేస్వామి, తెలుగు యువత నాయకులు కత్తాలి చంద్ర, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారిణి సరిత

నేరాలు ఘోరాలు


వివిధ కారణాలతో నలుగురు ఆత్మహత్య



మృతిచెందిన పావని

పుట్లూరు : విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గాండ్లపాడు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గాండ్లపాడుకు చెందిన రామానుజన్‌రెడ్డి కుమార్తె పావని కోయంబత్తూరులో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతోంది. వినాయక చవితి పండుగ సందర్భంగా ఇంటికి వచ్చింది. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తాళలేక రాత్రి రూమ్‌లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అనంతరం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తండ్రి రామానుజన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

కళ్యాణదుర్గం : పట్టణంలోని పార్వతీనగర్‌లో నివాసం ఉంటున్న లైన్‌మెన్ రామాంజనేయులు (57) గురువారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు సునీల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... రామాంజనేయులు కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో లైన్‌మెగా పని చేస్తున్నాడు. 2020లో కరోనా సోకడంతో అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో విధులు కూడా సక్రమంగా వెళ్లేవాడు కాదు. అంతేగాకుండా జీవితంపై విరక్తి చెందుతోందని తరచూ అనేవాడన్నారు. ఈనేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు.



రామాంజనేయులు (పాతచిత్రం)

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పాలవెంకటాపురం గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు(40) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గొల్ల శ్రీనివాసులును చాలాఏళ్లుగా ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఎంతమంది వైద్యులకు చూపించినా నయం కాలేదు. ఈనేపథ్యంలో అనారోగ్య సమస్య తీవ్రం కావడంతో భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇంటి పైన ఉన్న ఇనుప దూలానికి పంచతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య ఉంది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఉరేసుకున్న శ్రీనివాసులు

గార్లదిన్నె : మండల పరిధిలోని కోటంక గ్రామానికి చెందిన శోభ (22) విషద్రావం తాగి గురువారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎర్రిస్వామి కూతురు శోభను ఆరేళ్ల క్రితం కోటంక గ్రామానికి చెందిన సదానందకు ఇచ్చి వివాహం చేశారు. అయితే వీరికి ఇప్పటి వరకూ సంతానం కలగలేదు. దీంతో మనస్థాపానికి గురైన శోభ బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాస్మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విషమించి గురువారం మృతిచెందింది. ఘటనపై ఎస్ఐ గౌస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శోభ (పాతచిత్రం)